గారు ఈ వూళ్ళో ఉన్నారా? అరె, పెద్ద దొరగారు యీ వూరొచ్చారా?"

వంటాయన: "అవును ఈ వూరొచ్చారు."

ఇన్స్పెక్టరు: "అదా. ఆయన తమ్ముడి గారిని చూద్దామని ఈ ఊరొచ్చారన్న మాట. ఏవిటీ! అయితే ఈ కుక్క ఆయనదన్నమాట. చాలా సంతోషం. దీన్ని తీసికెళ్ళు చాలా మంచి కుక్క. ఎంత బాగుంది. మంచి పని చేసింది కోళ్లు కొరికేసింది. జాకీ! వాడి కోపాని కేంలే భయపడకు."

వంటాయన కుక్కని తీసుకుని అక్కడ నుండి వెళ్ళిపోయాడు. అందరూ కోటయ్యని గేలిచేశారు.

ఇన్స్పెక్టరు అతన్ని చూసి "నీపనిపడతా నుండ"ని బెదిరించి కోటు గట్టిగా బిగించి రోడ్డుమీదికి దారితీశాడు.

---

స్కెచ్

# నైజగుణం

"సమీర"

కాంతమ్మకి వూళ్ళో ఏంగొడవొచ్చినా కావలసిందే. ఎవరి దారిని వాళ్ళని వదలిపెట్టదు. అందరిసంగతీ పట్టించుకుంటుంది. ఆవిడపిల్లలూ అంతే. ఎవరెవరి ఇంట్లో ఎప్పుడెప్పుడుపోట్లాడుకుంటున్నారో, వాళ్లేమిబట్టలు కట్టుకుంటున్నారో ఎంతమంది అతిథులు వాళ్ళింటికొస్తున్నారో, ఎప్పుడు వాళ్లు బయటికి వెళ్తున్నారో, అన్ని సంగతులూ కనిపెట్టి, వాళ్ళమ్మకి వచ్చి చెప్తూ తూండేవారు. ఇంట్లో బోలెడంత పనున్నా సరే, ఈ పక్కింటి వాళ్లు, ఆ ఎదురింటి వాళ్లు ఏం మాట్లాడుకుంటున్నారో, ఏం కూర వండుకుంటున్నారో, అన్నీ కనిపెడుతూనే వుండేది.

కాని కాంతమ్మభర్తమాత్రం తన స్కూలు మేష్టారి పనిమీదతప్ప మరోసంగతి పట్టించుకొనేవాడుకాదు. పెద్దబ్బాయి శంకరం స్కూలుఫైనల్ చదువుతున్నాడు. తీరుబడి అయినప్పుడల్లా స్టంటు సినిమాలు చూచి వచ్చి తమ్ముళ్ళకి ఆ కథలన్నీ చెప్పేవాడు.

కాంతమ్మా వాళ్ళింటిపక్కనే భీమశంకరమనే వకీలు కాపురమున్నాడు. ఆయనికి ఇద్దరు కొడుకులు ఒక కూతురు. ప్లీడరు భార్య తులశమ్మ కోడళ్ళను ఎప్పుడూ సాధిస్తూనే వుండేది. ఇంట్లోపనీ వాళ్లుచేసేవాళ్ళే కాని, వైధవ్యంలో వున్న కూతురుమటుకు ఏపనీముట్టుకునేదికాదు. ఆ సంసారాన్ని చూస్తే కాంతమ్మకి మహా చిరాకు. ఇరుగుపొరుగువాళ్లకి తులశమ్మకోడళ్ళకి పెట్టే కష్టాలని కొంచెం కల్పించి చెపుతుండేది.

ఆవాళ ఆదివారం. పొద్దున్నే వంటచేస్తున్న కాంతమ్మకి పక్కింట్లో ఏదో అలజడి వినిపించింది. పులుసుగరిట చేతినుంచి గిరవాటేసి, కళ్లజోడు సరిచేసుకుని, కిటికీలోంచి పక్కింట్లోకి తొంగిచూసింది. ఏముంది! అత్త కోడల్ని నానాతిట్లు తిడ్తోంది. చాలాసేపు వారి సంభాషణ విని, పొయిమీద కూర మాడిపోతుందని, పిల్లల్ని ఒక్కొక్కరినే లేపి, పక్కింటి పోట్లాట వినమంది కాంతమ్మ. పిల్లలు వరండాలోకొచ్చి తులశమ్మ పోట్లాట చాలా శ్రద్ధతో వినడం మొదలుపెట్టారు.

మధ్యాహ్నం పన్నెండయినా ఆ పోట్లాట తగ్గలేదు. మరీ పెద్దదయింది, కోడలి ఏడుపులు, అత్తగారిస్వరం హెచ్చడం ఒకేసారిజరిగాయి. ఇంతలో కొడుకొచ్చాడు. ఇహ కాంతమ్మ ఓపిక పట్టలేక తనూ వరండాలోకొచ్చింది. ఇంతకీ అసలు సంగతేమిటంటే కాంతమ్మయింటి వరండాలోనుంచి చూస్తే తులశమ్మయింటి కిటికీలగుండా వాళ్ళింట్లో జరిగే ప్రతీ విషయం వీళ్ళకు కనబడుతుంది కొడుకొచ్చినా కూడా పోట్లాట తగ్గలేదు

ఉన్నట్లుండి తులశమ్మగారింటి కిటికీ తలుపులన్నీ మూతబడ్డాయి. ధభీధభీమని లోపలి నుండి శబ్దం వినబడుతోంది. ఇంకేముంది. తల్లీ కొడుకులిద్దరూ కలిసి కోడల్ని చావ బాదుతున్నారు. ఇంక కాంతమ్మ ఉండలేకపోయింది. వెంటనే ఎదురింటివాళ్ళనీ, పైన కాపురమున్న

వారినీ కేకలేసి పిలిచింది. "చూడండి ఎంత దారుణమో! ఆడకూతురుని అందరూ కలసి చావ బాదుతున్నారు. పక్కనే ఉండి మనం ఆ మాత్రం ఆ పిల్లకి సహాయం చేయకపోతే ఎట్లా? నలుగురూ మనల్నేమంటారు? పదండి వెళ్ళి రక్షిద్దాము" అంది గుక్క తిప్పుకోకుండా. ఎదురింటి రత్తమ్మ ఇలా అంటుంది: "అవునండీ! ఆ తులశమ్మెప్పుడూ అంతే. కోడలికి రంపం కోత పెడుతుంది. ఆ పిల్లను కన్నవాళ్లు రేపీ సంగతి వింటే ఎంత దుఃఖిస్తారు, అయ్యో! నా హృదయం తరుక్కుపోతుంది. పదండి. మన వాలేరును పిలుస్తాను. వెళ్ళి తలుపు కొడదాం" అంది.

వాళ్ళావిధంగా వాదులాడుకుంటోవుంటే శంకరం సైకిలుమీద వచ్చాడు. ఇంట్లో జరుగుతున్న హడావుడంతా చూసి "ఏమిటమ్మా ఇదంతా?" అనడిగాడు. "ఏముందిరా నాయనా! పక్కింటి వాళ్ళబ్బాయి పెళ్ళాన్ని చావ బాదుతున్నాడు తలుపులన్నీ బిగించి. "ఏం చేద్దాం?" అంది కాంతమ్మ చాలా తెలివిగా ముఖం పెట్టి. "అరె! అలాగా? ఒక ఆడదాన్నలా కొడుతూంటే ఎలా చూస్తూ వూరుకోవటం! అది ముఖ్యంగా నా కవమానం. నేనొకపని చేస్తాను. ముందు తలుపుకొట్టి వెళ్ళి ఆయనతో పోట్లాడుతాను. మీరెళ్ళి ఆ అమ్మాయిని మనింటికి తీసుకు రండి. తరువాత ఆ అమ్మాయివాళ్ళకి ఉత్తరం రాద్దాము" అన్నాడు శంకరం. ఉపాయానికి అందరూ అతన్ని మెచ్చుకున్నారు. ఇంక తులశమ్మ కోడలిని వాళ్ళవాళ్ళు వూరినుంచి వచ్చేంతవరకూ ఎవరింట పెట్టుకోవాలి, ఎట్లా కబురు పంపాలి అని వాళ్లల్లో వాళ్ళు వాదులాట వేసుకోవటం ప్రారంభించారు.

చివరికి ఒక తీర్మానానికి వచ్చి తులశమ్మ యింటికి అందరూ వెళ్ళారు. శంకరం తలుపు తట్టాడు. తులశమ్మ కిటికీలోంచి తొంగి చూసింది. "ఎందుకమ్మా, ఇలా వచ్చారు? మా యింట్లో తగవులు తీర్చటానికేనా? పాపం! ఎంత ఉదార హృదయం. పరాయివాళ్లు బాధ పడుతూంటే చూసి సహించలేరు కదూ! పొండి పొండి! మళ్ళీ యిటువంటి విషయాల్లో జోక్యం కలిగించుకున్నారంటే మాటలతో పోనీయను జాగ్రత్త!" అన్నది విసురుగా.

కాంతమ్మగారబ్బాయి వూరుకోలేదు. తలుపు తియ్యకపోతే పోలీసులను పిలిపిస్తానని బెదరించాడు. దానితో తులశమ్మకీ, కాంతమ్మకీ పెద్ద పోట్లాట ప్రారంభమైంది. కాని ఏలాభం తలుపు తెరుచుకోలేదు. వాళ్ళిద్దరి పోట్లాట హడావుడిలో ఇరుగుపొరుగు అమ్మలక్క అందరూ ఒక్కొక్కరే యిళ్ళకుజారుకున్నారు. చివరకి ఆ యుద్ధంలో శంకరం, కాంతమ్మ మటుకు మిగిలారు. ఆ రోజంతా కాంతమ్మా ఆమె పిల్లలూ మటుకు వరండాలో కూర్చుని తులశమ్మ కోడల్ని ఎట్లా రక్షించడమా యని ఆలోచిస్తూ నేవున్నారు.

తెల్లారింది. తులశమ్మ యిల్లంతా నిశబ్దంగా వుంది. కాంతమ్మ వరండాలోకొచ్చి తొంగి చూసింది. దొడ్లో తులసికోటదగ్గర తులశమ్మ కోడలు, దీపం వెలిగించి నమస్కారం చేస్తోంది. అత్తగారు దగ్గరనుంచుని చేతిలోవున్న పువ్వులు కోడలి తల్లో దోపుతోంది. తరువాత అత్తా కోడళ్ళిద్దరూ చెట్లకు నీళ్లుపోస్తూ, బలే హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అత్త చెప్పే కబుర్లువిని కోడలు కడుపుబ్బ నవ్వుతోంది. ఇది చూసిన కాంతమ్మ మొహం ఎర్రబడింది.

వాళ్ళ వైఖరి చూస్తే ఆమెకి ఈర్ష్య పుట్టుకొచ్చింది. ఆ కోడలికి బాగా దెబ్బలు తగిలి ఆస్పత్రికి తీసుకువెళ్ళివుంటే యెంత బాగుండేది అనుకుంది మనసులో. సాయంత్రం అవగానే వాళ్ళింట్లో అందరూ సినిమాకి వెళ్ళారు. కొడుకూ కోడళ్ళిద్దరూ ముందర ముచ్చటగా నడుస్తూంటే, వెనుక వెళుతున్న తులశమ్మ కాంతమ్మవంక గర్వంగా చూసింది.

ఆ సంఘటన జరిగినప్పటినుంచి, తులశమ్మ కోడలు శంకరాన్ని చూస్తే ముఖం చిట్లించుకుని తప్పుకునేది అతనొక పెద్ద రౌడీలాగ. తులశమ్మ ఇంటి కిటికీలెప్పుడూ మూసేవుండేవి. ఆ రెండు కుటుంబాలకీ విరోధం ఏర్పడింది. కాని ఆవేళ కాంతమ్మతో చేరి తులశమ్మను తిట్టిన పెద్దమనుష్యులందరూ, తులశమ్మకు మరింత సన్నిహిత స్నేహితులయ్యారు. కాని కాంతమ్మ మటుకు తన నైజగుణం మానలేదు.